వేతన వెతలు

ఐదు నెలలుగా జీపీ సిబ్బందికి అందని జీతాలు

ఏటూరునాగారం, ఆగస్టు 18 : వేతనాల కోసం పంచాయతీ సిబ్బంది ఎదురు చూస్తున్నారు. వివిధ కేడర్లలో పని చేస్తున్న సిబ్బంది ఐదు నెలలుగా జీతాలు లేక అవస్థలు పడుతున్నారు. ఒక్క ఏటూరునాగారం జీపీ పరిధిలోనే సుమారు 40 మంది వరకు సిబ్బంది పనిచేస్తున్నారు. ఇందులో సఫాయిలు 18 మంది వరకు ఉండగా ఇద్దరు పంపు ఆపరేటర్లు, ఇద్దరు ఎలక్ట్రీషియన్లు, ముగ్గురు డ్రైవర్లు, ఇద్దరు క్లీనర్లు, సెగ్రిగేషన్ షెడ్డు వద్ద పనిచేసే ఐదుగురితో పాటు పర్యవేక్షణ చేసే సిబ్బంది అంతా కలిసి సుమారు 40 మంది వరకు పనిచేస్తున్నారు. తక్కువ వేతనంతో పని చేస్తున్న వారికి సకాలంలో జీతాలు రాకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. కుటుంబ పోషణకు అవస్థలు పడుతున్నారు. పన్నుల రూపంలో వచ్చే ఆదాయాన్ని జీపీ ఖాతాలో వేసి చెక్కు ద్వారా ఎస్టీవో నుంచి తీసుకోవాల్సి ఉంటుంది. అందులో వేస్తున్నారే తప్పా తీసుకునేందుకు మాత్రం అనుమతి రాకపోవడంతో పెండింగ్‌లో ఉంటున్నాయి. జూన్ నెల వరకు వేతనాల కోసం బిల్స్ పంపించి నెల దాటుతున్నా పట్టించుకునే వారు లేకుండా పోయారు. ప్రభుత్వం వెంటనే స్పందించి తమకు వేతనాలు ఇప్పించాలని కోరుతున్నారు. వర్షాకాలం కావడంతో డ్రైనేజీలు శుభ్రం చేయడం, బ్లీచింగ్ పౌడర్ చల్లడం, చెత్త తొలగించడం లాంటి పనులు చేయడంతో పాటు దుర్గంధాన్ని భరించి పనిచేయాల్సి వస్తుందన్నారు. అయినప్పటికీ సకాలంలో

చెత్త సేకరిస్తున్న గ్రామ పంచాయతీ కార్మికులు

వేతనాలు అందకపోవడంపై ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక ఏటూరునాగారంతో పాటు రామన్నగూడెం, అల్లం వారి ఘన్‌పూర్, రొయ్యూరు, శంకరాజుపల్లి పంచాయితీల్లో పనిచేసే సిబ్బందికి కూడా వేతనాలు రావడం లేదని తెలుస్తోంది. కనీసం స్వాతంత్ర దినోత్సవం వరకైనా తమకు వేతనాలు చెల్లించి విమ్ముకి కలిగించాలని కార్మికులు కోరుతున్నారు.



లక్నవరం రహదారిలో ఉండిపోయి కూలడానికి ఉన్న భారీ వృక్షాలు

తస్మాత్ జాగ్రత్త !

గోవిందరావుపేట, ఆగస్టు 18 : పర్యాటక ప్రాంతమైన లక్నవరానికి వెళ్లే రహదారిలోని వృక్షాలు ఎండి పోయి కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. వర్షాకాలం కావడంతో భూమి నాని వృక్షాలు కుంగి ఎప్పుడు పడిపోతాయో తెలియని పరిస్థితి నెలకొంది. కొద్ది రోజుల క్రితం ఏటూరునాగారం వద్ద చెట్టు కూలి ఒకరు మృతి చెందిన విషయం తెలిసిందే.. కాగా, అధికారులు స్పందించి ఎలాంటి ప్రమాదం జరుగకముందే వాటిని తొలగించాలని వాహదారులు, ప్రజలు కోరుతున్నారు.

ఆటో బోల్తా పడి పది మందికి గాయాలు

ఏటూరునాగారం, ఆగస్టు 18 : మండలంలోని చిన్నబోయినపల్లి సమీపంలోని జాతీయ రహదారిపై ఆటో బోల్తా పడి పది మంది గాయపడ్డారు. వివరాలిలా ఉన్నాయి.. శంకరాజుపల్లి గ్రామానికి చెందిన పది మంది తాడ్వాయి మండలం నార్లాపూర్‌లో ఆదివారం జరిగిన బంధువు అంత్యక్రియలకు వెళ్లి వస్తున్నారు. ఈ క్రమంలో ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో అందులో ప్రయాణిస్తున్న కన్నెబోయిన మల్లమ్మ, ఎర్రబోయిన నాగేంద్ర, తీగల సారమ్మ, ఎద్దుల మహేశ్వరి, తీగల దుర్గ, తీగల కనకదుర్గ, అంతటి తిరుమలేశ్, పర్శబోయిన ఓదేలు, ఎర్రబోయిన శ్రీలత గాయపడ్డారు. క్షతగాత్రులను మండలకేంద్రంలోని సామాజిక వైద్యశాలకు తరలించి చికిత్స అందించారు.

సీసీ కెమెరాల ఏర్పాటు చేసుకోవాలి

చిట్యాల, ఆగస్టు 18 : సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రజలు ముందుకు రావాలని ఎస్సై శ్రావణ్ కుమార్ సూచించారు. ఆదివారం గోపాలపూర్‌లో సీసీ కెమెరాలపై ఆయన గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ నేరాల సంఖ్య తగ్గించేందుకు, శాంతిభద్రతలను కాపాడేందుకు సీసీ కెమెరాలు ఎంతగానో దోహదపడుతాయన్నారు. వ్యాపారులు షాపుల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్సై సమ్మిరెడ్డి, పీసీ సిబ్బంది అస్లాం జానీ, కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మూల శంకర్‌గౌడ్, జిల్లా ఎస్సీ సెల్ ఇన్‌చార్జి ఏకు రవీందర్, గ్రామస్తులు తణుకు శ్రీనివాస్, ఏరుకొండ రఘు, శ్రీరామ్ రాజేందర్, వనపర్తి స్వామి, అచ్చ భాస్కర్, జాలిగాపు రాజేశ్, లక్ష్మీనారాయణ, రాకేశ్ పాల్గొన్నారు.

మనస్తాపంతో మహిళ ఆత్మహత్య

టేకుమట్ల, ఆగస్టు18: కూతుర్లు గొడవపడుతున్నారని మనస్తాపం చెంది ఆదివారం ఓ మహిళ పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. వెల్లంపల్లి గ్రామానికి చెందిన రేపాల రజిత(38) తన ఇద్దరు కూతళ్లు తరుచూ గొడవపడుతున్నారని ఆవేశంతో బెదిరించేందుకు ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగింది. గమనించిన కూతుర్లు తండ్రికి చెప్పడంతో వెంటనే చిట్యాల దవాఖానకు తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందింది. మృతురాలి తండ్రి సంపంగి మల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై అమరేందర్ రెడ్డి తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడు

గోవిందరావుపేట, ఆగస్టు 18 : మండలంలోని చల్వాయి– గోవిందరావుపేట మధ్యలోని జాతీయ రహదారి సోమలగడ్డ క్రాస్ వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో సయ్యద్ అహ్మద్‌అలీ (20) అనే యువకుడు మృతి చెందారు. వివారాలిలా ఉన్నాయి.. బుస్సాపురం గ్రామానికి చెందిన అహ్మద్‌అలీ పాలు విక్రయించేందుకు బైక్‌పై పస్రా వెళ్తున్నాడు. ఈ క్రమంలో సుమారు రాత్రి 8:30గంటల సమయంలో సోమలగడ్డ క్రాస్ వద్ద మృతి చెంది కనిపించాడు. అయితే ఈ సంఘటనపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. అహ్మద్‌అలీ బైక్ పైనుంచి అదుపుతప్పి కిందపడి మృతి చెందాడా..? లేదా ఏదైనా వాహనం ఢీకొట్టి మృతి చెందాడా..? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కాగా, సంఘటనా స్థలాన్ని పస్రా ఎస్సై కమలాకర్ సందర్శించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ములుగు ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కోడి పందేల స్థావరంపై పోలీసుల దాడి

మంగపేట, ఆగస్టు 18 : కోడి పందేల స్థావరంపై ఆదివారం సాయంత్రం దాడి చేసినట్లు ఎస్సై టీవీఆర్ సూరి తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ఆయన కథనం ప్రకారం.. మండలంలోని తిమ్మంపేట శివారులో కోడి పందేలు ఆడుతున్నారనే సమాచారం మేరకు అక్కడికి వెళ్లగా ఐదుగురు వ్యక్తులు పట్టుబడ్డారన్నారు. నిందితుల నుంచి ఐదు సెల్ ఫోన్లు, ఆరు బైక్‌లు, రూ.1700 నగదు, ఒక కోడిని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై చెప్పారు. చట్టవిరుద్ధంగా కోడి పందేలు నిర్వహిస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

గుడుంబా విక్రయిస్తున్న ఇద్దరిపై కేసు

మండలంలోని రాజుపేట ఎస్సీ కాలనీలో గుడుంబా విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులపై ఆదివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. వీరి నుంచి 20 లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకున్నామన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

వెంకటాపూర్, ఆగస్టు 18: మండల కేంద్రానికి చెందిన గ్యాస్ వెల్డర్ కావటి కార్తీక్ ఇటీవల మృతి చెందాడు. విషయం తెలుసుకున్న తోటి కార్మికులు ఆదివారం బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేశారు. కార్తీక్ తల్లిదండ్రులకు రామప్ప యూనియన్ సభ్యులు రూ.31 వేల 500 ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ములుగు మెకానిక్ అధ్యక్షుడు ఎండీ అంకూస్, యూనియన్ సభ్యులు నగేశ్, పాష, విష్ణేశ్, రమేశ్, అన్వర్, గణపతి, రఘు పాల్గొన్నారు.

ఆస్తి కోసం తండ్రిని చంపిన కొడుకు

ములుగు జిల్లా హుమ్మాయినగర్‌లో ఘటన

ములుగురూరల్, ఆగస్టు 18 : భూమి కోసం కన్న తండ్రిని కడతేర్చిన పాశవిక సంఘటన మల్లంపల్లి జీపీ పరిధి హుమ్మాయినగర్‌లో రెండు రోజుల క్రితం జరిగింది. ఎస్సై వెంకటేశ్వర్‌రావు కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఓరుగంటి మహంకాళి(70) భార్య రెండేళ్ల క్రితం మృతి చెందింది. ఇంట్లో ఒంటరిగా ఉంటూ గ్రామంలో మరో చోట ఉంటున్న కుమారుడు ఓరుగంటి రమేశ్ వద్దకు వెళ్లి భోజనం చేసి ఇంటి వచ్చి నిద్రిస్తుంటాడు. కాగా, మహంకాళికి ఐదెకరాల భూమి ఉండగా ఈ భూమి విషయంలో కొడుకు తండ్రికి పలు మార్లు గొడవలు జరిగాయి. భూమిని ఇవ్వడం లేదనే కోపంతో రమేశ్ రెండు రోజుల క్రితం నిద్రిస్తున్న తండ్రికి ఉరి వేసి ఏమీ తెలియనట్లు ఇంటికి వెళ్లాడు. ఆదివారం ఇంట్లో నుంచి వాసన వస్తుండడంతో చుట్టు పక్కల వారితో కలిసి రమేశ్ మృతదేహాన్ని ఇంటి ముందు వేసి సహజ మరణంగా నమ్మించే ప్రయత్నం చేశాడు. మహంకాళి మృతిపై గ్రామస్తులు అనుమానాలు వ్యక్తం చేశారు. మృతుడి కుమార్తె మృతదేహంపై ఉన్న గాయాలను గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చింది. వెంటనే అక్కడికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం ములుగు దవాఖానకు తరలించారు. శనిగచర్ల కొమురమ్మ ఫిర్యాదు మేరకు రమేశ్‌తో పాటు అతని కుటుంబ సభ్యులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కాటమయ్య కిట్ల పంపిణీ

ములుగురూరల్, ఆగస్టు 18 : ములుగు జిల్లా కేంద్రంలోని సంక్షేమ భవన్‌లో కాటమయ్య కిట్లను గీత కార్మికులకు ఆదివారం బీసీ సంక్షేమ శాఖ అధికారులు అందజేశారు. ఈ సందర్భంగా గీత కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి రవిగౌడ్ మాట్లాడుతూ గీత కార్మికులందరికీ ప్రభుత్వం ఉచితంగా కిట్లను అందజేయడంతో పాటు ద్విచక్రవాహనాలను అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గీత కార్మికులు, అధికారులు పాల్గొన్నారు.